ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 19 నవంబరు 2025



26న జిల్లాలో అంచనాల కమిటీ పర్యటన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంచనాల కమిటీ ఈనెల 25 నుంచి 29 వరకూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. అందులో భాగంగా 26న విజయనగరం జిల్లా అంతా పర్యటించి ఆ రోజు రాత్రికి రామనారాయణాన్ని సందర్శిస్తారు. రాత్రికి విజయనగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో బస చేస్తారు. 27న ఉదయం పైడితల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 10.30కు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారు.

రైతులకు శుభవార్త

- నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ
- పీఎం కిసాన్‌తో కలిపి రూ.7 వేలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- జిల్లాలో 2,27,700 మందికి రూ.159 కోట్లు



విజయనగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు గుడ్‌న్యూస్. వారి ఖాతాల్లో రెండో విడత అన్నదాత సుఖీభవ నిధులు బుధవారం జమ కానున్నాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఈ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు జమకానుంది.

అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు జమ చేయనుంది. కూటమి అధికారంలోకి వస్తే సాగుకు ఆర్థిక భరోసా కింద ఏడాదికి రూ.20 వేలను అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పుడు పథకాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం మూడు విడతల్లో పీఎం కిసాన్‌తో కలిపి నగదు అందించనున్నారు. ఇప్పటికే ఆగస్టు 2న మొదటి విడత (మిగతా 6వ పేజీలో..)

ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం చంద్రబాబు కడప జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తారు. అటు తరువాత రైతుల ఖాతాల్లో నిధులు జమవుతాయి. కేంద్రం అందించే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం కలుపుకొని.. ప్రతి రైతు ఖాతాలో రూ.7 వేలు పడుతుంది.

– వీటి రామారావు, జేడీ



దండిగా దిగుబడి



- ఈ ఏడాది ఎకరాకు 26 క్వింటాళ్లు
- జిల్లా వ్యాప్తంగా 7.5 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చినట్లు అంచనా
- ఊరట చెందుతున్న అన్నదాతలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి దిగుబడి ఘనసీయంగా పెరిగింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి నమోదైంది. ఎకరాకు 26 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతుల కష్టాలు తీరనున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాల్లో పంట దిగుబడి వెల్లడైంది. ఖరీఫ్ సీజన్ మొదట్లో వర్షాలు అనుకూలంగా లేవు. జూన్, జూలై నెలల్లో వర్షాలు కురవలేదు. ఆగస్టు 15 నుంచి కురవడం మొదలైంది. రైతుల మొహంలో ఆశలు మొలకెత్తాయి. అప్పటి నుంచి గత నెలాఖరు వరకూ వానలు దంచి కొట్టాయి. కొద్దిరోజులు విరామం లేకపోవడంతో రైతులు పొలాలకు కూడా వెళ్లలేకపోయారు. మరోవైపు పంటసాగు ఖర్చులు కూడా స్వల్పంగా తగ్గాయి.

గత పదేళ్లుగా ఖరీఫ్ సీజన్ మొదట్లో వాతావరణం అనుకూలంగా ఉండి, పంట చేతికి అందే సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు పంటను దక్కించుకోవడానికి చాలా అవస్థలు పడేవారు. నీటి కోసం రైతుల మధ్య గొడవలు జరిగేవి. అయినా ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేకుండా విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా 1,22,000 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటికే వరి కోతలను ప్రారంభించారు. పంట కోత ప్రయోగాల ద్వారా అధికారులు దిగుబడిని (మిగతా 6వ పేజీలో..)


పంట కోత ప్రయోగం

దిగుబడి పెరిగింది


ఈ ఏడాది వరి పంట దిగుబడి ఘన సీయంగా పెరిగింది. గత కొన్ని సంవత్సరాలు కంటే ఈ సారి పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 26 క్వింటాళ్ల దిగుబడి నమోదవుతోంది. జిల్లా వ్యాప్తంగా 7 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– వీటీ రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి


గంట్యాడ: రామవరంలో కోతకు వచ్చిన వరి పంట

పనిభారంతో సతమతం

- పోలీసులకు తప్పని ఒత్తిడి
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- రెండేసి షిఫ్టుల్లో విధులు
- కొత్త కానిస్టేబుళ్లు వస్తేనే కాస్త ఉపశమనం



రాజాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):

ఏ శాఖలైనా బదిలీలు అంటే సంబరపడతారు పోలీస్ శాఖలో మాత్రం నిరాశ పడతారు. ఎందుకంటే ఎక్కడికి వెళ్లినా అదే ఒత్తిడి. తక్కువ సిబ్బంది పనిచేయడమే దీనికి కారణం. వాస్తవానికి ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 40 మంది సిబ్బంది ఉండాలి. ఎక్కడా 20కు మించి లేరు. దీంతో సిబ్బంది పని ఒత్తిడికి గురవుతున్నారు. రిటైర్మెంట్ వయసు 58 నుంచి 62 ఏళ్లకు పెరిగేసరికి చాలా శాఖల్లో ఆనందం కనిపించింది కానీ పోలీస్ శాఖలో మచ్చుకైనా కానరాలేదు. ఇప్పటికీ చాలా మందికి షిఫ్టుల్లో పనిచేయాల్సి వస్తోంది. రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నవారు కోకొల్లలు. మూడు షిఫ్టులనేది కాగితాలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తిచేసుకొని వస్తే కొంత ఉపశమనం దక్కుతుందని భావిస్తున్నారు. కొత్తగా ఆరు వేల కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఎస్‌ఐ పోస్టులు భర్తీ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఇంతవరకూ వారికి శిక్షణే ప్రారంభం కాలేదు.

షిఫ్టుల రొటేషన్..

పోలీస్ శాఖలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ మరో షిఫ్ట్ ఉంటుంది. అయితే ఉదయం షిఫ్ట్ చేసిన వారు మళ్లీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకూ చేయాల్సిందే. దీనినే రెండు షిఫ్టుల పద్ధతిగా పరిగణిస్తారు. సిబ్బంది లేకపోవడంతో రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన నెలలో విధిగా ప్రతి ఒక్కరూ 15 రోజుల పాటు నైట్ షిఫ్టులు చేయాల్సి ఉంటుంది. దీంతో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. చాలా మంది గుండెపోట్లకు, ఇతర రుగ్మతలకు గురవుతున్నారు. సిబ్బందిని నియమించి మూడు షిఫ్టులు కొనసాగిస్తే.. నెలకు పదికి మించి నైట్ డ్యూటీలు రావు. అది కూడా ప్రతి మూడు రోజులకు ఒకసారి నైట్ డ్యూటీ పడే అవకాశం ఉంది. వీక్లీఆఫ్‌లు సైతం తీసుకునేందుకు వెసులబాటు కలుగుతుంది.

ఉమ్మడి జిల్లాలో మూడు సబ్ డివిజన్లను 10 సర్కిళ్లుగా విభజించారు. జిల్లా వ్యాప్తంగా 41 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు సీసీఎస్, మహిళా, ట్రాఫిక్, మెరైన్ పోలీస్‌స్టేషన్లు కొనసాగుతున్నాయి. ఏ స్టేషన్‌లోనూ పూర్తిస్థాయి సిబ్బంది లేరు. పెరుగుతున్న విధులకు ఈ సిబ్బంది ఏ మూలకూ చాలడం లేదు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది షిఫ్టులు వేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర, అనారోగ్య పరిస్థితులు, ఇంటి అవసరాలకు గంటల లెక్కనే సెలవు మంజూరవుతోంది. అత్యవసరం అయితే తోటి సిబ్బందితో సర్దుబాటు చేసుకోవాల్సిందే. అదీ కూడా స్టేషన్ అధికారి అనుతిస్తేనే. లేకుంటే ఇబ్బందులు తప్పవు.

చేతి 'చమురు'..

జిల్లాలో దాదాపు ప్రతిస్టేషన్‌లోనూ రక్షక్ వాహనాలున్నాయి. అయితే ప్రతినెల 20 నాటికే రక్షక్ వాహనాలకు పెట్రోల్, డీజిల్ ఉండడం లేదు. దీంతో సిబ్బంది జేబులకు చిల్లులు పడక తప్పని పరిస్థితి. అసలే అంతంతమాత్రం జీతం కావడంతో వారు పడే బాధలు వర్ణనాతీతం. ఒక్కో రక్షక్ వాహనానికి నెలకు 120 లీటర్ల డీజిల్ ఇస్తున్నారు. కానీ పాత వాహనాలు కావడం, మైలేజీ రాకపోవడంతో 15 రోజులకే డీజిల్ అయిపోతోంది. ఆ తర్వాత ఎవరో ఒకరిపై ఆధారపడక తప్పడం లేదు. ఇంతలో రక్షక్ వాహనాలు మరమ్మతులకు గురైతే అంతే పరిస్థితి. బ్లూకోట్స్ వాహనాల పరిస్థితి గురించి చెప్పనవసరం లేదు. నెలకు 30 లీటర్ల పెట్రోల్ ఇస్తున్నారు. చాలకపోవడంతో సిబ్బంది పెట్టాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా దృష్టిపెట్టాలని పోలీసులు కోరుతున్నారు.

కాలువ నిర్మాణానికి ఒప్పుకోం

- సిద్ధార్థ కాలనీవాసుల ఆందోళన
- పనులకు ముంజేరు గ్రామస్థుల సన్నాహాలు
- వాదోపవాదాలతో ఉద్రిక్తత

7లో



ఏం తేల్చారో?

- ఏసీబీ తనిఖీలపై భోగాపురంలో కొనసాగుతున్న చర్చ
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రికార్డుల తరలింపు

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు ఏం తేల్చారో? ఏం లోపాలు గుర్తించారో? ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారో? అంటూ వివిధ అంశాలపై స్థానికంగా చర్చ కొనసాగుతోంది. జిల్లాలో ఒక్క భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే అవినీతి నిరోధకశాఖ అధికారులు పదిరోజుల కిందట తనిఖీ చేసిన విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి అన్ని కోణాల్లో ఆరా తీయడంతో పాటు రికార్డులు (మిగతా 6వ పేజీలో..)


భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


ప్రసాద్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి

మెరకముడిదాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ విధుల్లో ఉన్న జవాన్ అద్దూరి ప్రసాద్ (20) అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం గొల్లలవలస గ్రామానికి చెందిన అద్దూరి ప్రసాద్ అస్సాం రైఫిల్స్‌లో జవాన్‌గా ఉన్నాడు. మంగళవారం అస్సాంలో విధులు నిర్వహించడానికి బయలుదేరాడు. మోటారు సైకిల్‌పై ఇద్దరు సైనికులు వెళ్తుండగా వెనుక నుంచి ఆర్మీకి చెందిన వ్యాను ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు తల్లిదండ్రులు లక్ష్మి, పాపారావుతో పాటు వివాహమైన అక్క ఉన్నారు. ప్రసాద్ గతేడాది డిసెంబరు 14న ఆర్మీలో చేరాడు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు 7

కొత్తవలస తహసీల్దార్‌పై విచారణ 7

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి 7

అలర్ట్

- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు
- జంక్షన్లు, లాడ్జీలలో సోదాలు
- ప్రతి వాహనాన్నీ ఆపుతున్న పోలీసులు

విజయనగరం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి టైగర్ జోన్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ కార్యదర్శి హిడ్మాతో పాటు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పైగా హిడ్మాకి మూడెంచెల భద్రతగా ఉన్న మావోయిస్టు గెరిల్లా దళాలు విజయవాడలోని ఆటోనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ షెల్టర్‌గా ఉండడం, భారీ ఎత్తున వారి నుంచి ఆయుధాలు బయటపడడం సంచలనం కలిగించింది. దీంతో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఎస్పీ ఏఆర్ దామోదర్ జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగానికి తనిఖీలకు ఆదేశించారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్‌ఐలు అన్ని ప్రాంతాలను జల్లెడ పట్టారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. విజయనగరం లాడ్జిలలో కూడా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. పార్వతీపురం-మన్యం తదితర గిరిజన ప్రాంతాల నుంచి బయటకు వచ్చే రహదారులు బొబ్బిలి, రామభద్రపురం, గజపతినగరం, ఎస్.కోట (మిగతా 6వ పేజీలో..)


విజయనగరం: అంబటిసత్తర్వు జంక్షన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు


పారాది అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

సమయానికి రాకపోవడమేంటి?

- ఆ ముగ్గురికీ షోకాజ్ నోటీసులు ఇవ్వండి
- ఎంపీడీవోను ఆదేశించిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి
- సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

రామభద్రపురం/బొబ్బిలి/రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరుకాకపోవడంతో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రామభద్రపురం సచివాలయం-3ని మంగళవారం ఆయన సందర్శించారు. మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించాక హార్టీకల్చర్ అసిస్టెంట్ జి.వరలక్ష్మి, సర్వేయర్ వరప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ్‌చంద్రకుమారి విధులకు రాకపోవడాన్ని గమనించారు. ఆ ముగ్గురికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో రత్నంను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతీరోజూ 10కంటే ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. తౌలుత సచివాలయం పరిధిలో ఎన్ని రేషన్‌కార్డులు ఉన్నాయి, రేషన్ షాపులు ఎన్ని ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో ఎంత రెవెన్యూ వస్తోంది అని సిబ్బందిని అడిగారు. ఆయన వెంట బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు ఉన్నారు.

అంగన్వాడీ వర్కర్‌ను సస్పెండ్ చేయండి: కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ పాటించకపోవడంపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. బొబ్బిలి మండలం పారాది అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, రికార్డు నిర్వహణపై ఆరా తీశారు. మంగళవారం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో టమాటపప్పు వండాలి. తయారు చేయకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యానికి బాధ్యురాలైన అంగన్వాడీ వర్కర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మూడు రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో హాజరు నమోదు చేయకపోయినా గుర్తించనందుకు సీడీపీవోకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. అంతకుముందు అంగన్వాడీ (మిగతా 6వ పేజీలో..)

రైతులకు శుభవార్త

(ఐదో పేజీ తరువాయి)

అందించారు. బుధవారం రెండో విడత అందించనున్నారు. చివరి విడతలో కేంద్రంతో కలిపి రూ.6 వేలు డిపాజిట్ ఇస్తారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు.. కలిపి రైతులకు రూ.20 వేలు అందనుంది. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఈ పథకాన్ని అమలుచేస్తోంది. సచివాలయాల వారీగా అర్హుల జాబితాను ప్రచురించింది. ఈకైవైసీ చేయించుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. ఆధార్ కార్డులు, వెబ్‌ల్యాండ్‌లో తప్పిదాలు సరిచేసేందుకూ గడువు ఇచ్చింది.

గజపతినగరంలో అత్యధికం..

జిల్లా వ్యాప్తంగా 2,27,700 మంది రైతులకు రూ.150.03 కోట్లు అందజేయనున్నారు. ఒక్కొక్కరికీ రూ.7 వేలు జమకానుంది. మొత్తం రూ.150 కోట్ల వరకూ జిల్లాకు ఈ ఉమ్మడి పథకం ద్వారా లబ్ధి చేకూర నుంది. జిల్లాలో అత్యధికంగా గజపతినగరం నియోజకవర్గంలో 43,644 మందికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందనుంది. రాజాం నియోజకవర్గంలో 38,691 మందికి, బొబ్బిలి నియోజకవర్గంలో 34,744 మం దికి, చీపురుపల్లిలో 36,174 మందికి, విజయనగరం 4,794 మందికి, నెల్లిమర్లలో 27,654 మందికి, ఎస్.కోటలో 41,211 మంది రైతులకు ఈ ఉమ్మడి పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

మాట తప్పిన జగన్..

వైసీపీ హయాంలో జగన్ మాట తప్పారు. తాను అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు సాగు ప్రోత్సాహం కింద రూ.15 వేలు అందిస్తానని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక రూ.7,500 సాయానికే పరిమితం అయ్యారు. కేంద్రం అందించే రూ.6 వేలతో కలుపుకొని రూ.13,500 అందించారు. అదంతా తామే ఇస్తున్నట్టు పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చుకున్నారు. అప్పట్లో రైతుభరోసా పేరిట సాయం అందించిన జగన్ అప్పటివరకూ రైతులకు అందిస్తూ వచ్చిన చాలా రకాల రాయితీలను నిలిపివేశారు. యంత్ర పరికరాల జాడలేదు. రాయితీపై అందించే ఎరువులను తగ్గించేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాయితీ పథకాలను పునరుద్ధరిస్తూనే.. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడం ద్వారా చంద్రబాబు రైతు పక్షపాతి అనిపించుకుంటున్నారు.

దండిగా దిగుబడి

(ఐదో పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఎకరాకు 23.5 క్వింటాళ్లు రాగా 2023 ఖరీఫ్‌లో 21 క్వింటాళ్లు, 2022 ఖరీఫ్‌లో ఎకరాకు 19.5 క్వింటాళ్లు, 2021 ఖరీఫ్‌లో 18.9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మాత్రం ఎకరాకు 26 కింటాళ్లు దిగుబడి వస్తోంది. ఈ పరిస్థితిలో జిల్లా వ్యాప్తంగా 7 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్న ట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టు కున్నారు. మిగిలిన ధాన్యాన్ని రైతులు తిండి అవసరాలకు వినియో గించుకుంటారు.

సమయానికి రాకపోవడమేంటి?

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రంలోని చిన్నారులతో కాసేపు సరదాగా గడిపి పిల్లలతో ముచ్చటించారు.

● సచివాలయ సిబ్బంది ప్రజల పట్ల మర్యాద, సేవాదృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ రామసుందరరెడ్డి సూచించారు. బొబ్బిలిలోని సాయి నగర్ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అందరూ సమయపాలన పాటించాలన్నారు.

ఏం తేల్చారో?

(ఐదో పేజీ తరువాయి)

సైతం తీసుకెళ్లారు. కార్యాలయ అధికారులు, కొందరు దస్తావేజు లేఖర్లనూ లోతుగా విచారించారు. ఇంత జరిగిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ అందరిలో కొనసాగుతోంది.

జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు చేసేందుకు భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మాత్రమే ఎంపిక చేసుకున్నారు. దీంతో జిల్లా అంతా ఉలిక్కి పడింది. అనేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలున్నప్పటికీ భోగాపురం నుంచి అధికంగా ఫిర్యాదులు వెళ్లాయని తెలు స్తోంది. ఈనెల 5,6 తేదీల్లో కార్యాలయ పనులు నిలుపుదల చేయించి ప్రతీ రికార్డునూ క్షుణ్ణంగా పరిశీలించారు. అనేక వివరాలు నమోదు చేసుకొన్నారు. అలాగే అక్రమంగా ఉంచిన రూ.35వేలను స్వాధీనం చేసుకోవడంతోపాటు కొన్ని రికార్డులను అవినీతి నిరోధకశాఖ అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. కక్షిదారులు, దస్తావేజు లేఖర్లు, మధ్యవర్తులతో నిరంతరం కళకళలాడే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంతం ఏసీబీ సోదాల సమయంలో బోసిపోయింది. ఏ ఒక్కరూ ఆప్రాంతంలో కానరాలేదు. ఏసీబీ వెళ్లాక అనేక అంశాలపై స్థానికంగా చర్చ మాత్రం నడుస్తోంది. ఏం జరగబోతోందనేదానిపై ఒక్కొక్కరూ ఒక్కో విధంగా మాట్లాడుకుంటున్నారు. చర్యలు ఉంటాయా, బదిలీలు ఉంటాయా అని కూడా ఊహించుకొంటున్నారు. ఈ విషయమై జిల్లా సబ్‌రిజిస్ట్రార్ (ఎస్ఎసీ) పి.ఉపేంద్రరావును వివరణ కోరగా అవినీతినిరోధకశాఖ అధికారులు తమ సోదాలపై ఇచ్చే నివేదిక ఆధారంగా ఐజీ కార్యాలయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. తమకైతే ఇంకా ఎటువంటి సమాచారం లేదని చెప్పారు.

అలర్ట్

(ఐదో పేజీ తరువాయి)

ప్రాంతాల రహదారుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీసీ కెమెరాల్లోంచి కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బుధవారం కూడా విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాలోని అన్ని అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నారు.

కారు ఢీకొని బైకిస్టుకు తీవ్ర గాయాలు

రామభద్రపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): బూసాయవలస వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని బైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వెలమల ప్రసాద్ కథనం ప్రకారం.. విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళుతున్న కారును రామభద్రపురం నుంచి స్టేషన్ బూర్జవలస వైపు వెళుతున్న బైకిస్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దత్తిరాజేరు మండలం స్టేషన్ బూర్జవలసకు చెందిన బొగ్గి లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు, చేతులు పూర్తిగా విరిగిపోవడమే కాకుండా బైకు నుజ్జునుజ్జయింది. దీంతో గాయపడిన వ్యక్తిని 108లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దగ్ధమైంది. వెంటనే గ్రామస్థులు మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

రామభద్రపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి 14 రోజులు జైలుశిక్ష విధిస్తూ సాలూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ మంగళవారం తీర్పునిచ్చారని ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. సాలూరు మండలం దత్తివలస గ్రామానికి చెందిన గంట వెంకటేష్ రామభద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 17న డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డాడని ఆయన వివరించారు.

కూటమిపై నమ్మకంతో పెట్టుబడుల వెల్లువ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అపారమైన నమ్మకంతో పెట్టుబడిదారులు రాష్ట్రానికి తరలి వస్తున్నారని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. చంద్రబాబు సమర్థత, పవన్‌కల్యాణ్ నిజాయితీ, లోకేశ్ శ్రమతత్వం ఫలితంగా రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువగా వస్తున్నాయన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో పది హైదరాబాద్ లాంటి మహా నగరాలను తయారు చేయడమే చంద్రబాబు ఆశయమన్నారు. ఇందుకు కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తోందన్నారు. ఇటీవల విశాఖ నగరంలో నిర్వహించిన సీఐఐ సమ్మిట్ రాష్ట్రాభివృద్ధికి చాలా దోహదపడుతుందన్నారు. వైసీపీ హయాంలో ధాన్యం రైతులు పడిన పాట్లు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. సంక్రాంతి పండుగలను చేసుకోలేక, కుటుంబాలకు దూరంగా పొలాల్లో ధాన్యం కోసం రాత్రిళ్లు రైతులు కాపలా కాసేవారన్నారు. ధాన్యం అందజేస్తే బిల్లుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అలాంటి సమస్యలేవీ లేకుండా రైతులకు వేగంగా బిల్లుల చెల్లింపునకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 22 న బంగాళా ఖాతంలో తుపాన్ సంభవిస్తుందని వాతావరణ శాఖ హెచ్చరి స్తున్న నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే హితవు పలికారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కౌతు రామ్మూర్తి, సీనియర్ నేతలు అల్లాడ భాస్కర రావు, మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, పీఏసీఎస్ ఇన్‌చార్జి బేతనపల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు మలపరెడ్డి శ్రీను, వ్యవసాయశాఖ ఏడీ మధుసూదనరావు, ఏవో శ్యామ్‌సుందర్, సీఎస్ డీటీ రెడ్డి సాయికృష్ణ, టీడీపీ కూటమి నాయకులు రౌతు రామ్మూర్తి, గిరడ అప్పల స్వామి, వాసిరెడ్డి సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, గెంబలి శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి



జనసేన పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి అప్పలస్వామి

బొబ్బిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి కోరారు. స్థానిక 19వ వార్డు అగ్రహారం వీధిలో వార్డు వర్కింగ్ ఇన్‌చార్జి కొట్టేడ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జనసేన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు విజయ ఢంకా మోగించాలన్నారు. ఇంతవరకు 11 వార్డులకు ఇన్‌చార్జిలను నియమించామని, మిగిలిన వార్డులకు కూడా నియమిస్తామన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో ప్రజలతో మమేకం కావాలని, ఆయా వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని తన దృష్టికి తీసుకు వస్తే ఎమ్మెల్యే ద్వారా వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, పెద్దింటి మనోజ్‌కుమార్, వార్డు వర్కింగ్ ఇన్‌చార్జి కొట్టేడ సురేష్, పైల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశు పోషకులకు నోటీసులు ఇవ్వండి



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్

బొబ్బిలి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొడవీధితో పాటు పలు ప్రాంతాల్లోని పశువుల పెంపకందారులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె మంగళవారం మున్సిపల్ మార్కెట్, గొడవీధి, ఎన్టీఆర్ సెంటర్, రామా టాకీస్ సెంటర్, బలిజిపేట రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో విచ్చలవిడిగా పశువుల సంచారంపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దాంతో ఆమె పశు పోషకులకు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపల్ మార్కెట్‌లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను క్లియర్ చేసి బ్రషింగ్ చేయించాలని పారిశుధ్య సూపర్‌వైజర్లను ఆదేశించారు. కాంపాక్టర్ బిన్లు వచ్చేవరకు ట్రాక్టర్ల ద్వారా చెత్తలను తరలించాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టరు సీహెచ్ మురళి, పర్యావరణ ఇంజనీరు సోమేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో భూపరిశీలన

బొబ్బిలి రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు అందిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు మంగళవారం పరిశీలించారు. కొండదేవుపల్లికి చెందిన బోరపురెడ్డి సాంబశివరావు తమ భూసమస్యపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదుకు సంబధించి రెవె న్యూ సిబ్బంది ఇచ్చిన ఎండోర్స్‌మెంట్‌తో సంతృప్తి చెందని ఆయన తిరిగి ఫిర్యాదును రీఓపెన్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీను కొండ దేవుపల్లి చేరుకుని క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారి భూమిని పరిశీలిం చారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంకుమార్, వీఆర్వో తదితురులు పాల్గొన్నారు.

12 మందిపై బైండోవర్ కేసులు

సీతానగరం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 12 మందిపై మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కె.పవన్ కుమార్ బైండోవర్ కేసులు నమోదు చేశారని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బైండోవర్ కేసుల్లో ఉన్నవారు ఏడాది కాలంలో మరలా మద్యం కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిం చనున్నట్టు తెలిపారు. మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు పా టించాలన్నారు. మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు.గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వ హిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14405కు గానీ 9440902373 నెంబరుకు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థిని తలకు గాయం

సీతంపేట రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సవర జయసుధ తలకు గాయమైంది. గడచిన రెండు రోజుల క్రితం పాఠశాల ఆవరణలో తోటి విద్యార్థినిలతో కలిసి వాలీబాల్ ఆడుతున్న సమయంలో కిందపడ టంతో తలకి గాయమైనట్టు తెలిసింది. పాఠశాల సిబ్బంది గమనించక పోవడంతో విద్యార్థినికి జ్వరం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడింది. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది జయసుధను మంగళవారం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఏపీఆర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణజ్యోతితో మాట్లాడుతూ వాలీబాల్ ఆడుతున్న సమయంలో విద్యా ర్థిని జయసుధకు వాలీబాల్ తగిలిందని, ముందస్తుగా మెరుగైన వైద్య పరీక్షల కోసం శ్రీకాకుళం తీసుకువెళ్లామన్నారు.

రూ.482 కోట్లు స్త్రీనిధి రుణ లక్ష్యం



మాట్లాడుతున్న డీజీఎం కృష్ణంనాయుడు

రామభద్రపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణాల కింద రూ.482 కోట్లు ఇవ్వాలనేది లక్ష్యమని డీజీఎం కృష్ణంనాయుడు తెలిపారు. మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు రూ.435 కోట్ల రుణం అందజేశామన్నారు. అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని డ్వాక్రా మహిళలు స్త్రీనిధిని వినియోగించుకుని తమ జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని సూచించారు. వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి కల్పించడానికి ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. స్త్రీనిధి కోసం దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో వారి అకౌంట్‌లో ఈ నిధులు జమవుతాయన్నారు. 11 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా స్త్రీనిధి పథకంపై పూర్తి వివరాలతో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏజీఎం వై.చిట్టిబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు పూర్ణిమ పాల్గొన్నారు.

మళ్లీ చెలరేగిన కాకర్లవలస భూవివాదం

● ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న గిరిజనులు



ఎక్స్‌కవేటర్‌ను అడ్డగించిన గిరిజనులు

రామభద్రపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కాకర్లవలసలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఎస్ఎంఈ పార్కు పనుల కోసం వచ్చిన ఎక్స్‌కవేటర్‌ను గిరిజనులు అడ్డుకున్నారు. సీపీఎం నాయకుడు బలసా శ్రీను ఆధ్వర్యంలో గిరిజనులు ఎక్స్‌కవేటర్ ఎదుట బైఠాయించారు. తమ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేస్తే కానీ పనులు జరగనివ్వమని గిరిజనులు పట్టుబట్టారు. దాదాపు ఐదు నెలలుగా ఈ వివాదం జరుగుతున్నప్పటికీ జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. భూముల కోసం ప్రాణాలైనా అర్పిస్తామన్నారు. విషయం తెలుసుకున్న బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గిరిజనులకు నచ్చజెప్పినా వారు వినలేదు. ఇక్కడి సమస్య పరిష్కారానికి ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతానని సీఐ నారాయణరావు హామీ ఇచ్చినా గిరిజనులు అంగీకరించలేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూములను సాగుచేసుకుని జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి భూములను ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని గిరిజన మహిళ తవుడమ్మ, లక్ష్మి, విజయలక్ష్మి ప్రశ్నించారు. సీఐతో పాటు ఎస్ఐ వెలమల ప్రసాద్ ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మంగళవారం కమ్మవలస, శివడవలస, పిరిడి సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఉద్యోగుల హాజరు పట్టీ, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. సచివాలయంలో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందించే సేవలు, లబ్ధిదారుల వివ రాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. నిర్ణీత సమయంలో సర్వేలన్నీ పూర్తిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హె చ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు ఉన్నారు.

క్లాప్‌మిత్రలకు చెత్త అందివ్వండి

బొబ్బిలి రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోని చెత్తను రోడ్లు, కాలువల్లో పారబోయకుండా క్లాప్ మిత్రలకు అందివ్వాలని ప్రజలకు ఎంపీడీవో రవి కుమార్ సూచించారు. మంగళవారం గున్నతోటవలసలో చెత్త సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 28 మంది ఎంపిక

● 22న బాపట్లలో యోగా పోటీలు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బొబ్బిలి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో ఈ నెల 22న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మంగళవారం స్థానిక సంస్థానం హైస్కూల్‌లో జిల్లా ఎంపికలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ డివిజన్ ఇన్‌చార్జి ఎన్.వి.నాయుడు, హెచ్‌ఎం డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లావ్యాప్తంగా అండర్ -14, 17 విభాగాలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో రాష్ట్ర స్థాయి పోటీలకు 14 మంది బాలురు, 14 మంది బాలికలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 గొట్టాపు వాసు మాట్లాడుతూ యోగాతో మానసిక పరిపక్వత, శారీరక ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాలో ప్రావీణ్యం సాధించాలన్నారు. వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవడేందుకు యోగా దోహదపడుతుందన్నారు. ఎంపికలకు 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్ట్ టెస్ట్‌లో విజేతలకు అభినందనలు

బొబ్బిలి నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థానం హైస్కూల్ మైదా నంలో మంగళవారం తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ టెస్ట్ ప్రమోషన్‌లో బొబ్బిలికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. జి.షణ్ముఖనందన్, జి.మోహన్‌మురళీకృష్ణ, ఎస్.శ్రీవర్ధన్ రెడ్-1, జె.జోష్ణప్రియ, ఆర్.నిహాల్ అభిరామ్ ఎల్లో బెల్ట్‌లు సాధిం చారన్నారు. వీరందరినీ ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థులకు బంగారు పతకాలు

రామభద్రపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపూర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో 900 మంది క్రీడాకారులు పాల్గొనగా ఫైటింగ్, స్పీడ్ కిక్కింగ్ విభా గాల్లో గ్లోబల్ స్కూల్ విద్యార్థులు లిఖితారావు, తస్వికారావు బంగారు పతకా లు సాధించారని స్కూల్ చైర్మన్ పోల వెంకటరమణ తెలిపారు. ఈ సంద ర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ చంద్రమోహన్, ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

బాడంగి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పెదపల్లిలో ఇంటి కోసం అన్నద మ్ముల మధ్య తగాదా ప్రారంభమై చివరకు హత్యాయత్నానికి దారితీసిందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిసిన వివరాల మేరకు కోటపర్తి కృష్ణ, గురుమూర్తులు అన్నదమ్ములు. వీరి మధ్య ఇంటి కోసం ఆదివారం గొడవ జరిగింది. అన్న కృష్ణ తమ్ముడు గురుమూర్తిపై కత్తితో దాడి చేశాడు. దాంతో గురుమూర్తికి మెడపై, చెవి, నుదిటపై మూడు గాయాలయ్యాయి. ప్రస్తుతం విశాఖలో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో మంగళవారం తెంటువలస వద్ద కృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

దాడులు అరికట్టండి



నిరసన తెలుపుతున్న నాయకులు

బొబ్బిలి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో దళిత, గిరిజన మైనార్టీలపై దాడులను అరికట్టి సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం దక్షిణదేవిడి సెంటర్‌లో ఆపార్టీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కోట అప్పన్న మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో 15 ఏళ్ల కాలంలో దళిత, మైనార్టీ, గిరిజనంపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, నాయకులు సూరి, బాబ్జీ, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షించాలి

బొబ్బిలి రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. కింతలివానిపేట లో మంగళవారం ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం మూలంగా వర్షం కురవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. పెరు గుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు దోహదపడతాయన్నారు. ఉపాధి హా మీ పథకంలో భాగంగా నాటుతున్న మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం



నిలిచిన పనుల దృశ్యం

బొబ్బిలి రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): అలజంగి జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచి ఉంది. గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడులో భాగంగా అదనపు భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. నేటికీ పనులు పూర్తి కాలేదు. ఈ పాఠ శాలలో 130 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ అదనపు భవనాలు అవసరమని గుర్తించి నిర్మాణాన్ని ప్రారంభిం చారు. అయితే నేటికీ పనులు పూర్తిచేయకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడంలేదు.

● ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి వద్ద ప్రస్తావించగా.. భవన నిర్మాణానికి అధికారులు సిమెంట్ ఇస్తామని చెప్పారన్నా రు. వచ్చిన వెంటనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

పది ఫలితాల్లో మొదటి వరుసలో ఉండాలి

● ప్రైవేటు పాఠశాలల కంటే మంచి ర్యాంకులు రావాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి వరుసలో నిలవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను కొలిచే మొదటి ప్రమాణం వారి ర్యాంకేనని అన్నారు.జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు మించి ప్రభుత్వ పాఠశాలలు ర్యాంకులు సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

నాణ్యతపై దృష్టి పెట్టండి..

మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. మోనూ కచ్చితంగా పాటించాలని చెప్పారు. డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం 87 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో మన జిల్లా 7వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈసారి మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిసెంబరు 5వ తేదీలోగా సిలబస్ పూర్తి చేసి... 100 రోజుల కార్యాచరణ ప్రకారం ప్రత్యేక తరగుతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన స్కౌట్ మాస్టర్లను కలెక్టర్ సత్కరించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో సాధించాలి

ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను సకాలంలోని సాధించాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి తన చాంబర్‌లో జిల్లాలోని పలు ప్రాజెక్టులను సంబందించి భూసేకరణ, ఎంఎస్ఎంఈ పార్కుల, పరిశ్రమల అభివృద్ధిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్‌హెచ్-130 సిడి రోడ్డు ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువు లోగా జరగాలన్నారు. జాప్యాన్నికి గల కారణాలు గుర్తించి పరిష్క రించాలన్నారు. రైల్వే మూడు,నాలుగో లైనుల్లో భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, ఆర్‌డీవోలు కీర్తి, రామ్మోహన్, ప్రమీలగాంధీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

● ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో విషాదం



వెంకటనాయుడు (ఫైల్)

బెలగాం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణను ఈనెల 30నచేసి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో గడుపుదామని మురిసిపోతున్న ఆ ఉపాధ్యాయుడిని మృత్యువు కబళించింది. మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆయన మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనంమేరకు.. పార్వతీపురం పట్టణంలోని బైపాస్ కాలనీలో నివాసముంటున్న మరిశర్ల వెంకటనాయుడు (62) పార్వతీపురం మండలం నర్సిపురం పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయు డిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా నర్సిపురం విజయబ్యాంక్ దగ్గరలో గుర్తు తెలియని వాహనం ఆయన్ని ఢీకొట్టింది. దాంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సహచర ఉపాధ్యాయులు ఘటనా స్థలానికి చేరుకని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు జిల్లా ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):గొట్లాంలో ఆరు మద్యం సీసాలు ఓ మ హిళ నుంచి స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఐలు పి.శాంతిలక్ష్మి, పి.నరేంద్రకుమార్, కానిస్టేబుళ్లు వి.అప్పారావు, అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ కండక్టర్ వైర్ చోరీ

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కివరం జంక్షన్ సమీపంలో విద్యుత్ కండక్టర్ వైర్ చోరీపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదురావు మంగళవారం తెలిపారు. సర్వే నెంబరు 436, 437లో ఈనెల నాలుగో తేదీన నాలుగు కిలో మీటర్ల పరిధిలో కండక్టర్ వైర్ చోరీ జరిగినట్లు పేర్కొన్నారు.విశాఖ జిల్లా పెదవాల్తేరుకు చెందిన పి.నీలాద్రిరాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దగ్ధమైన కారు నెల్లూరు వాసిదిగా గుర్తింపు

ఎస్.కోట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొడ్డవర హైవే వద్ద ఇటీవల దగ్ధమైన కారు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈమేరకు కారు పూర్తిగా దగ్ధమయ్యిందని, దీని సాసి, ఇంజన్ నెంబర్లను సేకరించామని సీఐ నారాయణమూర్తి తెలిపారు.ఈ మేరకు కారు అడ్రస్ లభించిందని, నెల్లూరుకు చెందిన వ్యక్తిదిగా గుర్తించి, ఆయనకు ఫోన్‌చేసినట్లు చెప్పారు. కొద్దిరోజుల కిందట ఓ వ్యక్తి తన కారు తీసుకొని వెళ్లాడని, తర్వాత ఆయన ఫోన్‌స్విచాఫ్ చేశాడని నెల్లూరువాసి తెలియజేశాడని సీఐ పేర్కొన్నారు. ఈ విషయంపై మరింత దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ

విజయనగరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోషల్ మీడియాకుదూరంగా ఉండాలని మహిళా పోలీసుస్టేషన్ సీఐ ఈ నర్సింహమూర్తి తెలిపారు. మంగళవారం విజయనగరంలోని పలు జూనియర్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు

విజయనగరం క్రైం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రధానరహదారులపై పశువులను విడిచిపెడితే యాజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. రహదారులపై పశువులు సంచరించడంతో ప్రమాదాలు పెరగడంవల్ల ప్రజలు, వాహనదారుల భద్రతదృష్ట్యా పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలి: ఏఎల్‌డీఎం

బొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి వివిధ పథకాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు, ఇతర వ్యవహారాలు నిర్వహిస్తున్న లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని నాబార్డు ఏఎల్‌డీఎం వైడీ ప్రత్యూష సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయిలోని వివిధ బ్యాంకులు, వెలుగు, ఉపాధి, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, స్త్రీనిధి బ్యాంకు లింకేజీ డీపీఎం జె.లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

కొత్తవలస తహసీల్దార్‌పై విచారణ

కొత్తవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజుపై విజయనగరంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుమేరకు మంగళవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళీ కృష్ణ విచారణ నిర్వహించారు.మండలంలోని చీపురువలసకు చెందిన సర్వే నెంబరు 162-2లోని మూడెకరాల 95 సెంట్లకు సంబంధించి ఎంపీటీసీ మాజీ సభ్యుడు యల్లపు సూరిబాబు తనను తహసీల్దార్ లంచం అడిగారని ఫిర్యాదుచేశారు. ఈ మేరకు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ మంగళవారం తహసీల్దార్ కార్యాలయలో విచారణ జరిపారు. మళ్లీ విచారణను బుధవారానికి వాయిదా వేశారు. తనపై నిరాధారమైనా ఆరోపణలు చేశారని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తారకరామా తీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా సరిపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని నిర్వాసిత రైతులు, టీడీపీనాయకుడు గేదెల రాజారావు,బోనుమహంతి ఆదినారాయణ, బాబూరావు, సారిపల్లి గోపాలమూర్తి, ఆల్తి ప్రకాశరావుతో కలిసి ఆయన మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

క్రీడాకారులు ఆరోగ్యాన్ని కాపాడుకోండి

విజయనగరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని ఎస్పీ దామోదర్ సూచించారు. ఇటీవల కాకినాడలో జరిగిన 14వ రాష్ట్ర తైక్వాండో ఫుమ్సే 2025 పోటీల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ బీఎస్ఎన్ మూర్తి మూర్తి బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో కానిస్టేబుల్‌ను ఎస్పీ దామోదర్ మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్‌బీ సీఐ లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మళ్లీ పల్లెపండుగ

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మళ్లీ పల్లెపండుగ కార్యక్రమం చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ నిధులతో మిగిన సిమ్మెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో జె.ఆనందరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ నర్సింహులు, రాజగోపాలనాయుడు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో

లక్కవరపుకోట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్డీవో కీర్తి తెలిపారు. మంగళవారం సోంపురం జంక్షన్‌ను ఆనుకొని ఉన్న పెట్రోల్‌బంకు ఏర్పాటుపై తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుతో కలిసి స్థల పరిశీలించారు.

చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి

గంట్యాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) చట్ట ప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి సూచించారు. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులో మంగళవారం నవంబరు నెల దత్తత అవగాహన మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తత తీసుకునే విధానంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బీపీఎస్‌ను వినియోగించుకోండి

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమకట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన బీపీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు ఒక ప్రకటనలో కోరారు. 1985 నుంచి ఈఏడాది ఆగస్టు 31వరకూ చేపట్టిన భవన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకున్న భవనాలకు చట్టబద్ధత వస్తుందని పేర్కొన్నారు. ఇంటిపన్నుపై దీర్ఘకాలిక అనధికార అపరాధరుసుము నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు.

రోజుకి రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలి

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా పనిచేసేవారికి రోజుకి కనీసం రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శారాదా దేవి కోరారు. మంగళవారం మండలంలోని ముంజేరులో ఉపాధిహామీ పథకం పనులు పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ముందస్తుగా కొలతలు ఇచ్చి ఆ ప్రకారం పని పూర్తి చేసేలా చూడాలని, తద్వారా అనుకున్న వేతనం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో భాగ్యలక్ష్మీ, క్షేత్ర సహాయకులు అచ్చుతరావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజపతినగరం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్ రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 13న నిర్వ హించే జాతీయ మెగాలోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవా లని సూచించారు.కార్యక్రమంలో సీఐ రమణ, ఎక్సైజ్‌శాఖ సీఐ జనార్దన్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వెటర్నరీ కళాశాల విద్యార్థులు

గరివిడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వెటర్నరీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభచూపి తృతీయ బహుమతి సాధించారు. ఇటీవల మహారాష్ట్ర యానిమల్ అండ్‌ఫిషరీ సైన్సెస్ కాలేజీ ఆతిథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి, వీసీఐ సహకారంతో వన్‌హెల్త్ యూత్ కాంక్లేవ్ -2025 అనే సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఇందులో గరివిడి కళాశాల విద్యార్థులు శ్రీవేంకటే శ్వరవెటర్నరీ యూనివర్సిటీ తరఫున పాల్గొని వన్‌హెల్త్ అంటే ఏమిటి అన్న అంశంపై షార్ట్‌వీడియోగ్రఫీ చేసి పోటీల్లో ప్రదర్శించారు. దీనికిగాను జాతీయ స్థాయిలో మూడో స్థానం లభించింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, ప్రొఫెసర్లు ఆనీ సుప్రియా, బీఆర్ అంబేడ్కర్ అభినందించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ధరల పట్టికలు పెట్టాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు, క్లినిక్స్, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లలో తప్పనిసరిగా ధరల పట్టికలను పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు జీవనరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరల పట్టిక వివరాలను పూర్తిగా అందరికీ కనబడే విధంగా తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లింగనిర్ధారణ చట్టరీత్యానేరంఅన్న బోర్డులను తెలుగు,ఇంగ్లీషు భాషల్లో ప్రచురించాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రికి ఫైర్‌అనుమతులు ఉండాలని , సంతాన సాఫల్యకేంద్రాలు నడిపితే ఏఆర్‌టీ, సరోగసీ చట్టం అనుసరించి జాతీయ పోర్టల్ రిజిస్టర్ తప్పనిసరి అని తెలిపారు.

కాలువ నిర్మాణానికి ఒప్పుకోం

● సిద్ధార్థ కాలనీవాసుల ఆందోళన ● పనులకు ముంజేరు గ్రామస్థుల సన్నాహాలు ● వాదోపవాదాలతో ఉద్రిక్తత

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీలోని సిద్ధార్థ కాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనుల విషయంలో మంగళవారం ఉద్రిక్తత తలెత్తింది. వివరాల్లోకి వెళితే... సిద్ధార్థ కాలనీ మీదుగా మురుగు కాలువ నిర్మాణం విషయమై స్థానికులు, ముంజేరు వాసుల మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ముంజేరు ఆర్ అండ్‌బీ రహదారి నుంచి సిద్ధార్థ కాలనీ మీదుగా మురుగు కాలువ నిర్మాణానికి కొన్నేళ్ల కిందట అధికారులు ప్రయత్నించారు. దీనిని సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. గతంలో కలెక్టర్, ఆర్డీవో, ఎస్సీ కమిషన్ చైర్మన్, పోలీసు అధికారులు వచ్చి.. ప్రయత్నించినా పరిష్కారం కాలేదు. దీంతో కాలువ సమస్య అలాగే ఉండిపోయింది. ఇటీవల మరోసారి కాలువ నిర్మాణానికి పంచాయతీలో తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో ముంజేరు గ్రామస్థులు, కాంట్రాక్టర్ (డ్వాక్రా మహిళ) కలసి మంగళవారం కాలువ నిర్మాణ పనుల కోసం జేసీబీతో సిద్ధార్థ కాలనీ సమీపంలో పూడిక తొలగించేందుకు యత్నించారు. దీనిని సిద్ధార్థ కాలనీకి చెందిన మహిళలు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణం చేపట్టడానికి అంగీకరించబోమని పట్టుబట్టారు. అక్కడి గృహాలను తొలగించి...మరోచోట మంజూరు చేయించి... అప్పుడు కాలువ నిర్మించుకోవాలని అన్నారు. లేదంటే తమ ప్రాణాలు పోయినా మురుగు కాలువ నిర్మాణానికి అంగీకరించబోమని తేల్చిచెప్పారు. దీంతో ముంజేరు గ్రామస్థులు, సిద్ధార్థ కాలనీవాసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పాపారావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. మరోవైపు ఈవోపీఆర్‌డీ గాయత్రి, కార్యదర్శి రమణమ్మ అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అధికారులు స్థానికులతో కొంతసేపు మాట్లాడి అక్కడి నుంచి వెనుదిరిగారు. మధ్యాహ్నం తరువాత ముంజేరుగ్రామస్థులు మరోసారిపనులు చేపట్టగా..సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణ ప్రాంతంలో బైఠాయించారు. దీంతో అక్కడ పనులను ఆపేశారు. ఈ విషయమై వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అధికారులు మాట్లాడేందుకు విముఖత చూపారు.

గుర్లలో స్టీల్‌ప్లాంట్: కిమిడి



కొత్తఅగ్రహారం వాసులతో మాట్లాడుతున్న కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్ల వద్ద ఐదు వేల కోట్లతో స్టీల్‌ప్లాంట్ రానుండడంతో నియోజకవర్గానికి పూర్వ వైభవం వస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. మంగళవారం చీపురుపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆటంకాలు కల్పించవద్దని రైతులను కోరారు. మద్దువలస, తోటపల్లి, కొవ్వాడ భూసేకరణలో అనుసరించిన కన్సంట్ అవార్డు విధానం ద్వారా రైతులకు తక్షణ పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు వల్ల ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు రేగాన రామారావు, వలిరెడ్డి శ్రీరాములునాయుడు పాల్గొన్నారు. కాగా ఆర్వోబీ వల్ల తమ కాలనీకి వెళ్లే రోడ్డు మూసుకుపోతుందని, 20 అడుగుల రహదారి సౌకర్యం తమకు కల్పించాలని రిక్షాకాలనీ, కొత్తగ్రహారం వాసులు కోరారు. కళా వెంకటరావును వారంతా పార్టీ కార్యాలయంలో కలిశారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: అదితి



టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని ఆరో డివిజన్ జమ్ములో వైసీపీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ బార్నాల శ్రీను, బార్నాల శేఖర్, బార్నాల సంజీవరావు, కోట్ల వెంకటరావులు అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు గంటా రవి, పీతల కోదండరామ్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి

గజపతినగరం,నవంబరు18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని గుడివాడ, మరుపల్లి గ్రామాల్లో గల చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గుడివాడలో పారిశుధ్య పనులపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వే కాల్స్‌పై గ్రామస్థులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కళ్యాణి,డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, రమణ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నగరాభివృద్ధి

విజయనగరం టౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టికృషితోనే నగరాభివృద్ధి సాధ్యమని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ మావేశమందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 అంశాలను పొందుపరచగా సభ్యులు ఆమోదించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారని, అయితే కొంతమంది మాత్రం వీరిని టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ సిబ్బందికి స్టాండింగ్ కమిటీ పూర్తిస్థాయి మద్దతును ఇస్తుందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసుకోవాలని కోరారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, సహాయకమిషనర్ కె.అప్పలరాజు, కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జీవీ రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరుకావాలి

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని కోరారు. ఫీల్డ్‌కు వెళ్లిన సిబ్బంది సైతం ఆ వివరాలను కార్యాలయంలో పొందుపరచాలని సూచించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు.

వ్యాపారులకు అండగా ఉంటాం

రాజాం రైతుబజార్‌లో అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి అండగా ఉంటామని మునిపిపల్ కమిషనర్ రామచంద్రరావు స్పష్టం చేశారు. పాతబస్టాండ్ ఆవరణలోని రైతుబజార్ వెలుపల పదుల సంఖ్యలో కూరగాయల వ్యాపారం చేస్తుండడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కనీసస్థాయిలో అమ్మకాలు కూడా జరగడం లేదని ఈనెల 17న పలువురు వ్యాపారులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనేపధ్యంలో రైతుబజార్ లోపల, వెలుపల కమిషనర్ మంగళవారం పరిశీలించారు. 41 షాపులు ఖాళీగా ఉండడాన్ని కమిషనర్ గుర్తించారు. మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి వెలుపల వ్యాపారాలు చేసుకుంటున్న వారికి లోపల షాపులు ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు.

ఎస్.కోట పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి

శృంగవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల క్రీడామైదానం అభివృద్ధికి యువత నడుంబిగించింది. మన ఊరు-మనగ్రౌండ్ పేరుతో వాట్సాప్ గ్రూపు క్రియేట్‌చేసి మైదానాన్ని అభివృద్ధికోసం సందేశాలను పంపారు.వీరంతా ఇటీవల పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులతోపాటు దాతలసాయం అర్థిస్తున్నారు. ఈనేపథ్యంలో టీడీపీ నాయకులుకాపుగం టి.వాసు, వాకాడ బాలుమైదానాన్ని చదును చేసేందుకు ముందుకొచ్చారు. రూ.50వేలు వెచ్చించి తుప్పలు, డొంకలను తొలగించారు. ఘన కీర్తికలిగిన ఈమైదానం దశాబ్దకాలంగా నిరాదరణకు గురవుతోంది. చూట్టు ఆక్రమణలకు గురికావడంతోపాటు ప్రహరీ కూడాలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మైదానం చెరువును తలపిస్తోంది. ఈ నేపథ్యంలో యువకులు చూట్టు ప్రహరీ గోడ, దీనికి ఆనుకొని వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, సేద దీరేందుకు బెంచీలు, వాటి వద్ద నీడను ఇచ్చే మొక్కలను పెంచడం, మధ్యలో విద్యార్థులు ఆడుకో నేందుకు వివిద రకాల కోర్టులను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు తయారు చేసారు.



మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

అర్ధరాత్రి కె.కావేరి బస్సు బీభత్సం

● ముందు వాహానాలను ఓవర్ టేక్ చేయబోయి ప్రమాదం

● ఎన్టీఆర్ జిల్లాలో ఘటన ● 8 మందికి గాయాలు ● క్షతగాత్రుల్లో జిల్లా వాసి



నుజ్జునుజ్జైన బస్సు ముందుభాగం

నందిగామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కె.కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు అతి వేగంతో ఓవర్ టేక్ చేస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. సోమవారం అర్ధరాత్రి నందిగామ వద్ద బైపాస్ రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ప్రాణహాని జరగలేదు. కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు అతి వేగంతో ఓవర్ టేక్ చేస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 23 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో బస్సు భాగాలు లారీలో ఇరుక్కుపోయాయి. ఈ ఘటనలో 9 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వరుస బస్సు ప్రమాదాల నేపథ్యంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఉలికిపాటుకు గురి చేసింది. క్షతగాత్రులలో ఆరుగురికి స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వారు వెళ్లిపోగా మిగిలిన ముగ్గురినీ విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుల్లో విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన బెవర సతీష్‌కుమార్ ఎడమ మోకాలికి గాయమైంది.

మరింత మెరుగ్గా పోస్టల్ సేవలు

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం తూర్పు సబ్‌డివిజన్ పోస్టల్ శాఖ ఏఎస్పీ సుందరనాయుడు తెలిపారు. భోగాపురం సబ్ పోస్టాఫీసులో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా గతం కంటే మెరుగైన సేవలందుతున్నాయని తెలిపారు. రిజిస్టర్ పోస్టుకు బదులుగా ప్రస్తుత కాలానికి అనుగుణంగా స్పీడ్ పోస్టు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌పోస్టుమాస్టర్ రవి పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

● మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటను విక్రయించే విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించుకొనే పంటను అమ్ముకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో స్వరూపారాణి పాల్గొన్నారు.

శివలింగానికి కిరణ స్పర్శ



శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతమార్కెట్‌లో వెలసిన మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని చూడటానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చా రు. అనంతరంస్వామి వారికి అర్చకులు యశ్వం త్ ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం ప్రారంభానికి ముందు గతనెలలో శివలింగానికి సూర్యకిరణాలు తాకాయని.. నెల రోజుల వ్యవధిలో రెండోసారి ఇలా స్పృశించాయని యశ్వంత్ తెలిపారు.

గౌరీ పరమేశ్వరులకు పూజలు

శృంగవరపుకోట, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఎస్.కోట వన్‌వే ట్రాఫిక్ సమీపంలో ఆలయంలోగల శ్రీగౌరి పరమేశ్వరులకు గౌరి సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రత్యేక పూజలుచేశారు.

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజాంలో సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వేకువజామున రెండుగంటల పాటు వందలాది మంది అయ్యప్ప దీక్షాధరులు పురవీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు.